వేతన వెతలు


చింతకాని చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

- టెక్నికల్ అసిస్టెంట్లకు మాత్రమే రెగ్యులర్‌గా వేతనాలు
- ఇబ్బందుల్లో ఉపాధిహామీ ఉద్యోగులు
- పట్టించుకోని అధికారులు

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులను కల్పిస్తూ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు వేతన కష్టాలు తప్పడం లేదు. ఉపాధి ఉద్యోగులకు వేతనాలను ప్రతినెలా ఇవ్వక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉద్యోగులు రైతుల పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణం, భూమి చదును చేయుట, చెరువుల్లో పూడికతీత, ఫిష్ పాండ్స్, వరద మళ్లింపు కాలువలు, నర్సరీల నిర్వహణ, రహదారుల వెంట మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు తీయించటం, నీటి గుంటల నిర్మాణం, పొలాల్లో మట్టి కట్టల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, పశువుల, కోళ్ల షెడ్ల నిర్మాణం, అజోలా పెంపకం వంటి పనులను చేయించి పనులను పర్యవేక్షిస్తుంటారు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది తీసుకవచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టింతో ఉద్యోగులకు పనిభారం కూడా పెరిగింది. కూలీలతో సమానంగా ఎండల్లో పనులు చేస్తూ నిత్యం పనులను పర్యవేక్షిస్తూ కూలీలకు సకాలంతో వేతనాలు అందే విధంగా పనిచేస్తున్నప్పన్న వారికి మాత్రం వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

ఖమ్మం జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 20మంది అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు, 16మంది ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లు, 70మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 21మంది బేర్ ఫూట్ టెక్నీషియన్లు, 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 347మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వీరిలో కేవలం టెక్నికల్ అసిస్టెంట్లు, బేర్ ఫూట్ టెక్నిషియన్లకు మాత్రమే రెగ్యులర్‌గా వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు మూడు నెలలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదన్నారు. వేతనాలు సకాలంలో ఇవ్వకపోవటంతో కుటుంబ పోషణ భారం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందజేయాలని ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఇటీవల మంత్రి సీతక్కను కలిసి విన్నవించినా.. ఫలితం లేదని వాపోయారు.

ఉద్యోగ భద్రత లేదు..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2006లో ప్రారంభమైనప్పటి నుంచి 19 ఏళ్ల పాటు విధులను నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా వేతనాలను ఇవ్వకపోవటంతో పాటు శ్రమకు తగిన వేతనాన్ని చెల్లించటం లేదన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు శ్రమకు తగిన వేతనాన్ని ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలి..


ఫిబ్రవరి నెల నుంచి మూడు నెలల పాటు వేతనాలు రావటం లేదు. ఉపాధి ఉద్యోగులకు ఎప్పుడూ సక్రమంగా వేతనాలను చెల్లించలేదు. సకాలంలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధి హామీ ఉద్యోగులకు ప్రతినెలా వేతనాలను చెల్లించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– పి.కోటయ్య, ఏపీఓ, చింతకాని

ఉద్యోగ భద్రత కల్పించాలి..


ఉపాధిహామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా 19 ఏళ్ల పాటు పనిచేస్తున్నాను, క్షేత్రస్థాయిలో కూలీలతో సమానంగా పనిచేస్తూ పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు ఎంతో శ్రమిస్తున్నప్పటికి ఉద్యోగ భద్రత లేదు. ఉపాధి హామీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– బండి అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్, మత్కేపల్లి

శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి..


ఫీల్డ్ అసిస్టెంట్లకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి. కేటగిరీలుగా కాకుండా ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌కు నెలకు రూ.26 వేతనాన్ని అందజేయాలి. పనులు గుర్తించి, కూలీలకు జాబ్ కార్డులు, పనిదినాలను కల్పించటంతో పాటు కూలీల ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ వంటి పనులను పకడ్బందీగా చేస్తున్నాం.

– తలారి వేణుగోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్, చింతకాని

క్లుప్తంగా

పేరువంచలో ఆర్‌సీఎం చర్చి ప్రారంభం


పేరువంచలో ఆర్‌సీఎం చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ ప్రకాష్

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచలో శనివారం పునీత మాత ఆర్‌సీఎం చర్చిని బిషప్ సగిలి ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దైవ సందేశాన్ని ఇచ్చారు. ప్రతి ఒక్కరూ యేసు క్రీస్తు పట్ల విధేయత కలిగి ఉండాలని, సమాజంలోని నిరుపేదలు, దివ్యాంగుల పట్ల సానుభూతితో ఉండి సహాయం అందించాలని కోరారు. ఈ ప్రాంతానికి మొదటి సారి వచ్చిన సందర్భంగా బిషప్‌కు పలువురు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి విచారణ పరిధిలోని 10 గ్రామాల క్రైస్తవులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో పూజలు


జలబిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గౌడ కులస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ కంఠమహేశ్వర స్వామి, సురమాంబ తల్లికి జలబిందెలు, బోనాలతో పెద్దఎత్తున డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేసి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గౌడ కులపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గీతా మందిరంలో బ్రహ్మోత్సవాలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలో గల పార్థసారథి స్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 19వ అధ్యయనోత్సవ సహిత బ్రహ్మోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు కొత్తూరు రాజా తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృప పొందాలన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి తిరునాళ్లు


తిరునాళ్లలో పాల్గొన్న నాష్ ల్యాబ్ అధినేత కుటుంబ సభ్యులు

వేంసూరు: మండల పరిధిలోని ఎర్రగుంటపాడులో శనివారంపెద్దమ్మ తల్లి తిరునాళ్లు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నోష్ ల్యాబ్ అధినేత కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలి

ఎర్రుపాలెం: దేశంలో కులగణన ప్రక్రియ చేపడతామని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని, ఈప్రక్రియ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో కేంద్రం వివరణ ఇవ్వాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ సూచనలతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణనతోనే కేంద్రంలో కదిలిక వచ్చిందన్నారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరలేపిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రకటించాలన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త వజ్రాల శ్రీనివాసరెడ్డి, కృష్ణ కుమారి దంపతుల ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ బాధ్యులు చీదరాల సత్యానారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్న దానాల కన్నా అన్నదానం మిన్న అని తెలిపారు. కార్యక్రమంలో వీరారెడ్డి, కృష్ణమూర్తి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్ టాపర్లకు సన్మానం


విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

మధిర: ఇటీవల విడుదలైన ఇంటర్‌మీడియట్, ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సత్కరించారు. ఆయా విద్యార్థులను అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యన సన్మానించగా, ఉపాధ్యాయుడు ఇబ్రహీం మాట్లాడారు. విద్యార్థులు సినిమా, క్రికెట్, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటే చదువులో రాణించవచ్చని తెలిపారు. కాగా, కటకం రాంబాబు – శైలజ దంపతులు, తనూజ కలిసి 26 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, వాటర్ బాటిళ్లు అందించడంతో పాటు అల్పాహారం సమకూర్చారు. ఉపాధ్యాయుడు కటకం వెంకటకృష్ణారావు, భరత్ స్కూల్ ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావుతో పాటు చుక్కా రాంబాబు, పల్లపోతు ప్రసాదరావు, కటికల సీతారాంరెడ్డి, లింగంపల్లి అప్పారావు, జంగా శ్రీనివాసరెడ్డి, చెరుకూరి కృష్ణారావు కళ్యాణపు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు..

కల్లూరు: పది పరీక్షల్లో తెలంగాణ గ్రామర్ స్కూల్ విద్యార్థులు మండలస్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించడంతో యాజమాన్యం ఘనంగా సన్మానించింది. గోసు కీర్తి చంద్రయాదవ్(576) మండలస్థాయి ప్రథమ ర్యాంక్, ఎల్.కౌషిక్‌సాయి(572) ద్వితీయ, కె.హస్మిత(562)తృతీయ ర్యాంక్ సాధించడంతో.. టీజీఎస్ చైర్మన్ ఎస్‌కే.జానిమియా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రంజిత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ కేశవరావు, ఎండీ అయూబ్, ప్రిన్సిపల్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' ఆపేయాలి


జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుబల్లి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలంటూ సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం లంకపల్లిలో జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. దోపిడీ వర్గాలకు మావోయిస్టులు వ్యతిరేకంగా ఉడడంతో.. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల్లో పోలీసులు క్యాంపులు ఏర్పాటు చేసి సుమారు 25వేల మిలటరీ దళాలను దించడంతో.. గిరిజనుల ప్రాణాలు హరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వ్య.కా.సా మండల కార్యదర్శి విశ్వనాథం, నాయకులు బాబు, బుచ్చయ్య, రమణ, కొరయ్య, సరస్వతి, పద్మ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న రామారావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో శనివారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జెండాను ఫిట్ సెక్రటరీ రామారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రావి నాగేశ్వరరావు, తీగల క్రాంతికుమార్, సీతారామారావు, కోటేశ్వరరావు, సురేష్, ఐవి రెడ్డి, సుదర్శన్, తిరుమలరావు, సందీప్, శ్రీకాంత్, సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లిటౌన్: దేశంలో జనగణన, కుల గణనకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సత్తుపల్లిలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవి రమేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన, జనగణన చేపట్టడం వల్ల రాబోయే రోజుల్లో దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులను పసిగట్టి తిరిగి వాళ్ల దేశాలకు పంపించే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు బానోత్ విజయ్, పాలకొల్లు శ్రీనివాస్, జొన్నలగడ్డ నరేష్, నాగస్వామి, శివకృష్ణ, వసంతరావు, లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వీయంబంజర్ రింగ్ సెంటర్‌లో..

పెనుబల్లి: భారత ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి వీయంబంజర్ రింగ్ సెంటర్లో బీజేపీ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొర్రా నరసింహారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, జిల్లా అధికార ప్రతినిధి మధుసూదన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గుగులోత్ నాగేశ్వరరావు, నాయకులు అప్పారావు, నాగేశ్వరరావు, సంగీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..



రేవతికి నగదు అందిస్తున్న మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, సీపీఎం డివిజన్ కార్యదర్శి

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకై జరిగిన ప్రమాదంలో గుత్తికొండ వినోద్ కవల పిల్లలు మృతి చెందడంతో పాటు నలుగురు కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలైన విషయం విదితమే. శనివారం వినోద్ కుటుంబాన్ని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి పరామర్శించి.. గ్యాస్ కంపెనీ బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుడిమెట్ల మోహన్, రజిత రూ.10వేల నగదును వినోద్ భార్య రేవతికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, నాయకులు సత్యమూర్తి, అక్బర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని పినపాకలో అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆశీర్వాదాన్ని, ఎక్కిరాల ఆదాం లను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరమోహన్‌రెడ్డి, మండల కార్యదర్శి వెంకట్‌లాల్, రామిరెడ్డి, జమలయ్య, నరసింహా, కృష్ణయ్య, అరుణ్, పాండు, సాయి పాల్గొన్నారు.

నివాళి..


మధుసూధనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

కొణిజర్ల: మండలంలోని లాలాపురానికి చెందిన సీపీఎం సిద్ధాంత కర్త కురువృద్ధుడు సంక్రాంతి మధుసూధనరావుకి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి నివాళి అర్పించారు. శనివారం మధుసూధనరావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలోనే ఇటీవల మృతి చెందిన సంక్రాంతి వెంకటేశ్వరరావు, సతీష్‌ల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి వీరభద్రం, నాయకులు రాంబాబు, కృష్ణ, చలపతిరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరసింహారావు

బోనకల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్య విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు సోదరులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, పైడిపల్లి కిశోర్, గాలి దుర్గారావు, తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి, ఏపీఎం సురేందర్‌బాబు, సీసీలు వెంకటేశ్వర్లు, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి


తల్లాడ: గోపాలపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కొణిజర్ల/తల్లాడ: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు షేక్.ఖాసీమ్, తెలంగాణా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. శనివారం కొణిజర్ల మండలంలోని గుబ్బగుర్తి, లక్ష్మీపురం గ్రామాల్లోని, తల్లాడ మండలంలోని గోపాలపేట, అన్నారుగూడెం, నరసింహారావుపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ఇరవైరోజులుగా రైతులు కేంద్రాల్లోనే నివాసముంటు నరకయాతన పడుతున్నారన్నారు. వర్షం వస్తే పట్టాలు కప్పడం, తర్వాత తీయడం ఈ పనులతో సతమతం అవుతున్నారన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా కల్లాల్లో ఉన్న ధాన్యమంతా కొనుగోలు చేసి మిల్లర్లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఖాసీమ్‌ఖాన్, ఉపేందర్, లాలు, వెంకన్న, బీమా, తెలంగాణా రైతు సంఘం నాయకులు మోహన్ రావు, మహిళా రైతు జిల్లా కోకన్వీనర్ సమత, వెంకటేశ్వరరావు, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్


కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు

ఏన్కూరు: మండలంలోని శ్రీరామగిరి, ఆరికాయలపాడు, జన్నారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు శనివారం పరిశీలించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గన్ని సంచులు, లారీలు కావాలని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా.. కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట రామారావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో


వ్యవసాయ మార్కెట్‌లో పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మధిర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం బృందం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా రాస్తారోకోను ఉద్దేశించి సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. రైతాంగం ఇన్ని ఇబ్బందుల్లో ఉంటే అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. రైతులకు ఎల్లవేళలా సీపీఎం అండగా ఉంటుందన్నారు. పోలీసుల జోక్యంతో ఉన్నతాధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇచ్చిన హామీ మేరకు రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మందా సైదులు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు పాపినేని రామ నరసయ్య, తేలపోలు రాధాకృష్ణ, ఊట్ల శంకర్‌రావు, పుచ్చకాయల కిషోర్, రైతులు పాల్గొన్నారు.

పెద్దమునగాలలో..

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాలలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో సీపీఎం నాయకులు, రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. అధికారుల సహకారంతోనే మిల్లర్లు దోపిడికి పాల్పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. అనంతరం లక్ష్మీపురంలో సీపీఎం సీనియర్ నాయకుడు మురళి వర్ధంతి కార్యక్రమానికి హాజరై స్మారకస్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కృష్ణ, కృష్ణయ్య, నరసింహారావు, మండల కార్యదర్శి కుటుంబరావు, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి


మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం కిష్టారం నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మోటారు వాహనాల చట్టం, హిందూ వివాహ చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే జరీమానాతో పాటు శిక్షవిధించబడుతుందని, 21 ఏళ్లు నిండాకే వివాహం చేయాలని తెలిపారు. కొత్త న్యాయ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తు చేసుకోండి


యార్లగడ్డ దయానంద్

సత్తుపల్లిరూరల్: మండలంలోని అర్హత కలిగి ప్రతి నిత్యం పూజలందుకుంటున్న దేవాలయాలు రిజిస్ట్రేషన్ అయి ఉండి ఆర్థికంగా వెనుకబడి ఉండి దైవాన్ని నమ్మి నిత్యపూజలు జరుపుతున్న అర్చకులు జిల్లా పరిధిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆఫీసులో దరఖాస్తును పూర్తి చేసి అందించాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ దయానంద్ తెలిపారు. ప్రతి గ్రామంలో పూజలు అందుకుంటున్న ఆలయాలు ధూపదీప నైవేద్య పథకానికి అర్హత కలిగి ఉంటే తప్పకుండా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తును మీ దగ్గరలోని మీ సేవా కేంద్రంలో పొందవచ్చునని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఆలయ అర్చకులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మోడల్ కళాశాలలో ప్రవేశాలకు..

కారేపల్లి: కారేపల్లి మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల మే 5వ తేదీ నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మోడల్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ఆశక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సెస్సీ మార్కుల మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా ఈనెల 26వ తేదీన మోడల్ కళాశాల నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుందన్నారు. 27 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, అనంతరం విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కోసం..

కల్లూరు: సత్తుపల్లి నియోజకవర్గ రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సబ్సిడీపై మంజూరు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి జి.నగేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ భూమిలో నీటి వసతులు బావి, బోరు, కరెంట్ మోటార్ కలిగిన, పాస్‌బుక్ కలిగిన రైతులు మిరప, పత్తి, కూరగాయలు, మామిడి, జామ, నిమ్మ, పామాయిల్ పంటలు వేయదలచిన వారు అర్హులన్నారు. 5 ఎకరాల లోపు రైతులు సన్నా, చిన్నకారు రైతులుగా, 5 ఎకరాల కంటే ఎక్కువ ఉంటే పెద్ద రైతులుగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కావాల్సిన వారు తాళ్లూరి సుమన్, డ్రిప్ ఇరిగేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సెల్ నంబర్ 7893777631 ను సంప్రదించాల్సిందిగా కోరారు.